క్లుప్తంగా

వినాయక చవితి శుభాకాంక్షలు



జగ్గయ్యపేటఅర్బన్: వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ పండుగ ద్వారా ఆ విఘ్నేశ్వరుని కృపతో విఘ్నాలు అన్నీ తొలగిపోయి ప్రతి ఇంట ఆనందాలు వెల్లి విరియాలని కోరారు. ప్రజలకు అన్ని విధాలుగా విఘ్నేశ్వరుని కరుణ, కటాక్షాలు ఉండాలని ఆకాంక్షించారు. అలాగే పర్యావరణ పరిరక్షణకు భక్తులు అందరూ ఎటువంటి రసాయనాలు వాడని మట్టి విగ్రహాలు ప్రతిష్ఠించి పూజించాలని కోరారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



జగ్గయ్యపేటఅర్బన్: కష్టాల్లో ఉన్న పేదలను కాలయాపన చేయకుండా అత్యవసరంగా ముఖ్యమంత్రి సహాయనిధి పథకం ఆదుకుంటోందని, సీఎం రిలీఫ్‌ఫండ్ పేదలకు వరమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. ఎమ్మెల్యే నివాసంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో పేట మండలంలోని గుండబోయినపాలెం గ్రామానికి చెందిన తుమ్మలపల్లి సూరమ్మ ఇటీవల మోకాళ్లకు ఆపరేషన్ చేయించుకున్నారు. ఆమెకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.65 వేల చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. నాయకులు గద్దె సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళాలు



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేం చేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి ఆదివారం విజయవాడ పట్టణానికి చెందిన జీవీఎస్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ జి.బాలాజీ రూ.50 వేలు ఆలయ అధికారులకు అందజేశారు. హైదరాబాద్, కూకట్‌పల్లికి చెందిన సాయిసూర్య, లాస్య దంపతులు రూ.10 వేలు, అలాగే తెలంగాణా రాష్ట్రం, వరంగల్ పట్టణానికి చెందిన శ్యామల కల్యాణ్ వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం రూ.12,116లు విరాళంగా అందించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఏఈఓ తిరుమలేశ్వరరావు, సూపరింటెండెంట్ సునీత, ఆలయ ధర్మకర్త కోలా రామారావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రీ సర్వే



బలుసుపాడు(జగ్గయ్యపేట అర్బన్): జగ్గయ్యపేట మండలంలోని పలు గ్రామాల్లో జగనన్న భూహక్కు- సమగ్ర భూ రీ సర్వే కొనసాగుతోంది. మండలంలోని బలుసుపాడు గ్రామంలోని త్రిపురవరం ఫారెస్ట్ కింద ఉన్న పంట పొలాలను ఆదివారం రీ సర్వే చేశారు. త్రిపురవరం వీఆర్వో రమేష్ ఆధ్వర్యంలో మండల సర్వేయర్ తులసీరామ్, సిబ్బంది సర్వే నంబర్ 52, 33 ల్లో రీ సర్వే చేపట్టారు. వీఆర్వో రమేష్ మాట్లాడుతూ.. గతంలో 100 ఏళ్ల క్రితం చేసిన సర్వేనే నేటికీ కొనసాగుతుండటంతో పొలాల్లో సరిహద్దులకు సంబంధించి రైతుల మధ్య అనేక వివాదాలు, ఘర్షణలు జరుగుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నాటి విధానానికి స్వస్తి చెప్పి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని శాటిలైట్ సహకారంతో పారదర్శకంగా కచ్చితమైన కొలతలతో సమగ్ర భూ రీ సర్వే విధానానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. రీ సర్వేను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పలువురు రైతులు పాల్గొన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

జుజ్జూరు(వీరులపాడు): వాహనదారులు నిబంధనలకు అనుగుణంగా వాహనాలు నడపాలని లేకుంటే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ మహాలక్ష్మణుడు హెచ్చరించారు. మండలంలోని జుజ్జూరు గ్రామ శివారులో ఆదివారం ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు విధిగా నిబంధనలు పాటించాలన్నారు. అంతే కాకుండా ఆటోవాలాలు పరిమిత సంఖ్యలో ప్రయాణికులను ఎక్కించాలని నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణికులను ఎక్కిస్తే వాహనాలను సీజ్ చేయటంతో పాటు కేసులు నమోదు చేస్తామన్నారు. డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహనాలకు సంబంధించిన రికార్డులను విధిగా వెంట ఉంచుకోవాలని సూచించారు. అనంతరం రికార్డులు సక్రమంగా లేకుండా తిరుగుతున్న పలు వాహనాలను గుర్తించి జరిమానా విధించారు. తనిఖీలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చవితి వేడుకలకు సర్వం సిద్ధం

- గ్రామగ్రామాన ముస్తాబైన ఆలయాలు, పందిళ్లు
- మండపాలకు చేరిన గణనాథులు



ముక్త్యాల రోడ్డులో ఏర్పాటు చేసిన మండపం

జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల్లో వినాయకచవితి వేడుకలకు సర్వం సిద్ధమైంది. నవరాత్రి ఉత్సవాలకు గణేష్ మండపాలు సిద్ధమయ్యాయి. గణనాథుల విగ్రహాలు ఇప్పటికే మండపాలకు చేరుకున్నాయి. యువత ఆనందోత్సాహాలతో వేడుకల్లో నిమగ్నమయ్యారు. వివిధ రకాల రంగులతో ఆకర్షణీయంగా ఉన్న వినాయకుని ప్రతిమలను కొనుగోలు చేసి, తమ మండపాల్లో ప్రతిష్ఠించేందుకు సమాయత్తం అవుతున్నారు. జగ్గయ్యపేట పట్టణంలోని 31 వార్డుల్లో వందలాది ప్రతిమలను ఏర్పాటు చేసేందుకు పట్టణంలో వాడవాడలా పందిళ్లు వెలుస్తున్నాయి. ముక్త్యాల రోడ్డులోని విఘ్నేశ్వరస్వామి ఆలయం వద్ద ప్రత్యేక టెంట్‌లను ఏర్పాటు చేసి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసుకుని పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని పలు స్వచ్ఛంద సంస్థలు ప్రచారాన్ని చేపట్టారు. శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా వేడుకలు జరుపుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు.

పెనుగంచిప్రోలులో..

పెనుగంచిప్రోలు: తొలి పూజ అందుకునే దైవం వినాయకుడు. ఏకార్యం అయినా చేపట్టే ముందు వినాయకుడిని పూజిస్తే ఏఆటంకం ఉండదని భక్తుల నమ్మకం. సర్వ విఘ్నాలను తొలగించే వినాయకచవితి వేడుకలకు పల్లెలు, పట్టణాలు సిద్ధమయ్యాయి. సోమవారం నుంచి జరిగే చవితి ఉత్సవాలకు వినాయక ఉత్సవ కమిటీలు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో ఊరూవాడా పండుగ సందడి నెలకొంది. గణనాథుని విగ్రహాలు కళాకారుల ప్రతిభతో కాంతిలీనుతున్నాయి. రకరకాల ఆకృతులతో మెరిసి పోతున్నాయి. చవితి పందిళ్లలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహాల చేతిలో లడ్డూలు ఉంచి వాటిని వేలం వేయటం, భక్తులు వేలు ఖర్చు పెట్టి వాటిని వేలంలో దక్కించుకోవటం ఆనవాయితీగా వస్తుంది. వేలం వేసిన లడ్డూల ద్వారా వచ్చిన ఆదాయాన్ని ఉత్సవాల నిర్వహణకు వినియోగిస్తున్నారు. దీంతో స్వీటు దుకాణాల వారు వివిధ సైజుల్లో గణపతి లడ్డూలు తయారు చేస్తున్నారు. వినాయకచవితి పండుగ రోజుల ఏర్పాటు చేసే పాలవెల్లి అలంకరణకు వినియోగించే వివిధ రకాల పండ్లు, పూలుకు సంబంధించి పలువురు అమ్మకాలు నిర్వహించారు.

వత్సవాయిలో..

వత్సవాయి: వినాయక నవరాత్రులకు గ్రామాల్లో మండపాలు సిద్ధమయ్యాయి. గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో ఏర్పాటుచేసిన మండపాలను విద్యుత్ దీపాలతో పాలు రంగురంగుల దండలతో అందంగా తీర్చిదిద్దారు. అందంగా తయారు చేసిన మండపాల్లో వినాయక ప్రతిమను ఉంచి తొమ్మిది రోజులపాటు ఘనంగా పూజా కార్యక్రమాలను నిర్వహించుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. నవరాత్రులను పురస్కరించుకుని మండపాల వద్ద అనుమతులు లేకుండా ఎటువంటి కార్యక్రమాలను నిర్వహించరాదని, నిమజ్జనాల సందర్భంగా డీజేలు ఏర్పాటుచేసుకునే వారు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని ఎస్ఐ బి.అభిమన్యు తెలిపారు.

గ్రామాలకు తరలిన పార్వతి సుతుడు

నందిగామ: చవితి పర్వదినం నేపథ్యంలో వినాయక విగ్రహాలు, ప్రతిమల కొనుగోళ్లు జోరుగా సాగాయి. సోమవారం పండుగ నేపథ్యంలో ఆదివారం వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన ఉత్సవ కమిటీ ప్రతినిధులు తరలివచ్చి వివిధ ఆకృతుల్లో, పరిమాణాల్లో ఉన్న గణనాథుని విగ్రహాలు కొనుగోలు చేసి గ్రామాలకు తరలించారు. ఉత్సవ కమిటీలు ఎవరికీ వారే పోటాపోటీగా ఉత్సవాలు నిర్వహించేందుకు ఉత్సుకత చూపుతుండటంతో విగ్రహాల కొనుగోళ్లు జోరుగా సాగాయి. ఎంతో ఆసక్తిగా కొనుగోలు చేసిన వారు తగిన రక్షణ చర్యలతో పార్వతి సుతుని చలువ పందిళ్ల వద్దకు చేర్చారు. కొనుగోలు దారులతో విగ్రహాల విక్రయ ప్రాంతాలు ఉదయం నుంచి సాయంత్రం వరకు సందడిగా మారాయి.



నందిగామలో..



పెనుగంచిప్రోలులో సిద్ధమైన చవితి పందిరి



మక్కపేట రామాలయం వద్ద సిద్ధమైన మండపం



రైతుబజారు వద్ద విక్రయానికి సిద్ధంగా ఉన్న వినాయక ప్రతిమలు



గణనాథుడిని తరలిస్తున్న చిన్నారులు

గణపతి ఉత్సవ కమిటీలు నిబంధనలు పాటించాలి



నందిగామ: గణపతి ఉత్సవ కమిటీలు నిబంధనలు పాటించాలని ఏసీపీ జనార్దన్ నాయుడు ఆదేశించారు. పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం గణపతి ఉత్సవ కమిటీల నిర్వాహకులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ చవితి వేడుకలు ప్రారంభమైన దగ్గర నుంచి నిమజ్జన కార్యక్రమాలు పూర్తయ్యేంత వరకు ఉత్సవ కమిటీ నిర్వాహకులు తప్పనిసరిగా రూల్స్ పాటించాలన్నారు. అన్ని శాఖల అనుమతులు తప్పనిసరి అని చెప్పారు. లౌడ్ స్పీకర్లు ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల లోపు మాత్రమే విని యోగించుకోవాలన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ఉత్సవాలు నిర్వహించుకోవాలని సూచించారు. సమావేశంలో ఇన్‌స్పెక్టర్ హనీష్,ఎస్ఐ పండు, సిబ్బంది పాల్గొన్నారు.

పందిళ్లకు అనుమతులు తప్పనిసరి

కంచికచర్ల: పట్టణాల్లో, గ్రామాల్లో వినాయక చవితి వేడుకలు ప్రజలు, విగ్రహాల ఉత్సవ కమిటీ నాయకులు ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా చూడాలని నందిగామ ఏసీపీ జనార్ధన నాయుడు పేర్కొన్నారు. స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో ఆదివారం వినాయక చవితి మండపాల ఆర్గనైజర్లతో సమావేశం నిర్వహించారు. ఏసీపీ మాట్లాడుతూ.. నిర్వాహకులు పోలీసుల అనుమతులుతప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఊరేగింపులు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించే సమయంలో పోలీసులకు తెలియజేస్తే ఎటువంటి సంఘటనలు జరుగకుండా చూస్తామని చెప్పారు. నందిగామ రూరల్ సర్కిల్ సీఐ ఐవీ నాగేంద్రకుమార్, ఎస్ఐలు సుబ్రహ్మణ్యం, హైమావతి, సిబ్బంది,ఆర్గనైజర్లు పాల్గొన్నారు.

వాడవాడలా ఘనంగా విశ్వకర్మ జయంతి



విశ్వకర్మ జయంతి వేడుకల్లో ప్రభుత్వ విప్ ఉదయభాను, నాయకులు



పెనుగంచిప్రోలులో నివాళులర్పిస్తున్న నాయకులు



మక్కపేటలో నాయకుల ఆధ్వర్యంలో నివాళి



నందిగామలో పూజలు నిర్వహిస్తున్న నాయకులు

జగ్గయ్యపేటఅర్బన్: సమాజంలో రకరకాల వృత్తులకు ఆద్యుడైన విశ్వకర్మ జయంతిని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర పండుగగా సెప్టెంబర్ 17వ తేదీని అధికారికంగా ప్రకటించారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఉదయభాను నివాసంలో నిర్వహించిన విశ్వకర్మ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే ఉదయభాను విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ సహస్ర బాహుంగా, సహస్ర చక్షుగా, సహస్ర ముఖుడుగా అన్ని వేదాల్లో వర్ణించబడిన గొప్ప వ్యక్తి జయంతిని మన ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర పండుగగా ప్రకటించడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలో అన్ని వృత్తుల వారికి అండగా ఉన్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాత్రమేనన్నారు. కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ మానేపల్లి బ్రహ్మం, నాయకులు ఫిరోజ్‌ఖాన్, తన్నీరు నాగేంద్ర, జీవీడీ ప్రసాద్, టీఎస్ బ్రహ్మం, దుర్గ గుడి డైరెక్టర్ నంబూరి రవి, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాసగౌడ్ పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలులో..

పెనుగంచిప్రోలు: మండలంలో విశ్వకర్మ భగవాన్ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్రీతిరుపతమ్మవారి ఆలయం వద్ద విశ్వబ్రాహ్మణులు ముందుగా విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని వృత్తులు విశ్వకర్మ సృష్టించినవే అన్నారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘ మండల నాయకులు తునికిపాటి శివ, రామాచారి, రమణ, బ్రహ్మం పాల్గొన్నారు.

విశ్వానికి ఆదిగురువు.. విశ్వకర్మ

మక్కపేట(వత్సవాయి): విశ్వకర్మ జయంతిని ఆదివారం విశ్వబ్రాహ్మణ సంఘ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం సంఘ ఆధ్వర్యంలో నూతన జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు కొమరగిరి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. విశ్వానికి ఆదిగురువు విశ్వకర్మ అని తెలిపారు. భవిష్యత్ తరాలకు విశ్వకర్మ గురించి తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అదేవిధంగా ప్రభుత్వం విశ్వబ్రాహ్మణుల సంక్షేమం కోసం ప్రత్యేకంగా కృషి చేస్తోందని తెలిపారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు వెంకటేశ్వర్లు, అప్పలాచారి, బ్రహ్మం, వీరబ్రహ్మాచారి, రవి, శ్రీహరి, వేణు, చిప్పాడ శ్రీను, రవి, నరసింహాచారి, బ్రహ్మాచారి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నందిగామలో..

నందిగామ: విశ్వకర్మ జయంతి కార్యక్రమాన్ని ఆదివారం నందిగామ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక రామలింగేశ్వరనగర్‌లోని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మార్కెట్లలో వినాయక చవితి సందడి



గాంధీ సెంటరులో వినాయక ప్రతిమలను కొనుగోలు చేస్తున్న భక్తులు

నందిగామ: డివిజన్ వ్యాప్తంగా మార్కెట్లలో చవితి సందడి ప్రారంభమైంది. సర్వ విఘ్నాలు తొలగించే దేవుడిగా, తొలి పూజలందుకునే గణపయ్యకు చవితి నాడు భక్తులు పూజలు నిర్వహిస్తారు. ఇందుకోసం పత్రి, వినాయక ప్రతిమలు, నైవేద్యానికి వివిధ రకాల పండ్లు, మిఠాయిలు, పూలు కొనుగోలు చేస్తుంటారు. సోమవారం పండుగ నేపథ్యంలో ఆదివారం మధ్యాహ్నం నుంచి నందిగామ పట్టణంలోని ప్రధాన కూడళ్లు భక్తులతో కిటకిటలాడాయి. గాంధీ సెంటర్ మొదలుకొని మెయిన్ బజార్ వరకు పత్రి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. పట్టణం నుంచే కాకుండా చుట్టు పక్కల చందర్లపాడు, నందిగామ, వీరులపాడు, కంచికచర్ల మండలాల నుంచి కూడా ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి పత్రితోపాటు పూలు, పండ్లు, మిఠాయిలు కొనుగోలు చేస్తున్నారు. దీంతో మెయిన్ బజారు తిరునాళ్లను తలపిస్తోంది. ఏ స్టాల్ వద్ద చూసినా జన కోలాహలమే కన్పిస్తోంది. గాంధీ సెంటర్ పూర్తిగా పత్రి విక్రయందారులతో నిండిపోయింది.

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని పలు ప్రధాన వీధులు పత్రి అమ్మకాలతో కిటకిటలాడుతున్నాయి. ఈ సందర్భంగా ఆదివారం సాయంత్రం స్థానిక రైతుబజార్ మార్కెట్ ఎదురుగా ఉన్న ప్రధాన రహదారి పత్రి వ్యాపారులతో సందడిగా మారింది. వ్యాపారులు తోపుడుబండ్లపై పాలవెల్లి, పత్రికాయలు, ఎలక్కాయలు, మారేడు పండ్లు, కలువ పూలు, జిల్లేడు, ఉమ్మెత్తుకాయలు, నారింజ, మునగకాయలు, జామ, మేడిపండ్లు, దబ్బకాయలు, బంతిపూలు, మామిడి, అరటి ఆకులను తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. ఈ సందర్భంగా పట్టణ నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలి వచ్చి వాటిని కొనుగోలు చేశారు.



పేట రైతుబజారు సెంటర్‌లో ..

మట్టి వినాయక ప్రతిమల పంపిణీ



రామలింగేశ్వర్‌నగర్‌లో ప్రతిమలు పంపిణీ చేస్తున్న కోవెలమూడి తదితరులు



కంచికచర్లలో..



పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో..

నందిగామ: పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక ప్రతిమలను పూజించాలని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ కోవెలమూడి వెంకటనారాయణ సూచించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా అందజేశారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే పట్టణంలోని రామలింగేశ్వర్‌నగర్‌లోని బాబా గుడి వద్ద మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. అదేవిధంగా పర్యావరణ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని గాంధీ సెంటర్‌లో మట్టి వినాయక విగ్రహాలను అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ఏసీపీ జనార్దన్ నాయుడు ప్రారంభించారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని ముక్కోటి మండపం వద్ద వినాయక విగ్రహాలను భక్తులకు ఉచితంగా అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో రామిరెడ్డి శ్రీధర్, శాఖమూరి వంశీ పాల్గొన్నారు.

కంచికచర్లలో..

కంచికచర్ల: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు సానె రామ్మోహన్‌రావు కోరారు. స్థానిక మండల పరిషత్ కాంప్లెక్స్ వద్ద ఆదివారం 500 మందికి మట్టి వినాయకుల ప్రతిమలను పంపిణీ చేశారు. సంఘ కార్యదర్శి ముండ్లపాటి పోతరాజు, ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు, సంఘ నాయకులు బీవీ సర్వేశ్వరరావు, బి.కృష్ణమూర్తి, స్వర్ణలత, పెద్దినీడి కోటేశ్వరరావు, లక్ష్మణరావు, జానిమియా పాల్గొన్నారు.

పేటలో..

జగ్గయ్యపేటఅర్బన్: శ్రీపద్మశాలీ సంక్షేమ సంఘం వారి ఆధ్వర్యంలో ఉచితంగా వినాయకుని మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆదివారం స్థానిక ఉక్కు కళావేదిక వద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జాతీయ బీసీ సంఘం ఉపాధ్యక్షుడు, సత్యం గ్రూఫ్ ఎండీ గుజ్జ సత్యం కుటుంబ సమేతంగా పాల్గొని విగ్రహాలను పంపిణీ చేశారు. సంఘ అధ్యక్షుడు పెనుమల్లి చంద్రమౌళి, సంఘ నాయకులు అల్లి సత్యనారాయణ, రవికుమార్, మెటికల శ్రీనివాసరావు, యేశాల సీతారామమూర్తి, నక్కా రాములు, సంగెపు బుజ్జి పాల్గొన్నారు.

రహదారికి మోక్షం.. వాహనదారుల హర్షం



వీరులపాడు: పెద్దాపురం-కంచికచర్ల రహదారి విస్తరణ అభివృద్ధి పనులు పూర్తవటంతో రహదారిపై వాహనాలు రయ్ రయ్ మంటూ పరుగులు పెడుతున్నాయి. రహదారిపై భారీ ఎత్తున గుంతలు పడి ప్రయాణాలు సాగించేందుకు వాహనదారులు సైతం నానా ఇబ్బందులు పడ్డారు. రహదారి అభివృద్ధి చేయాలని కోరుతూ పలుమార్లు ప్రజా ప్రతినిధులను కోరారు. రెండు తెలుగు రాష్ట్రాలను కలిపే ప్రధాన రహదారి కావటంతో నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగించేవి. అంతే కాకుండా రహదారి అధ్వానంగా ఉండటంతో పలు ప్రమాదాలు సైతం చోటచేసుకున్నాయి. గడిచిన ఎన్నికలకు ముందుకు అధికారంలోకి రాగానే రహదారి విస్తరణ, అభివృద్ధి పనులు చేపడతామని ప్రస్తుత శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం పెద్దాపురం-కంచికచర్ల రహదారికి 15 కి.మీల మేర సుమారు రూ.18 కోట్లతో విస్తరణ, అభివృద్ధి పనులు చేపట్టారు. దీంతో రహదారిపై వాహనదారులు ఇబ్బందులు లేకుండా రాకపోకలు సాగిస్తున్నామని చెబుతుండగా ఆయా గ్రామాల ప్రజలు సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా పల్లెంపల్లి-వీరులపాడు ఆర్అండ్‌బీ రహదారిని సైతం సుమారు రూ.2 కోట్లతో విస్తరించి అభివృద్ధి చేయటంపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

విన్సెంట్ ది పాల్ సేవలు ఆదర్శనీయం



కంచికచర్ల: క్రైస్తవులకు ఆదర్శంగా నిలిచిన విన్సెంట్ ది పాల్ సేవలు ఆదర్శనీయమని ఆర్సీఎం సంఘ విచారణ గురువు పాస్టర్ పేరం దత్తు పేర్కొన్నారు. స్థానిక ఆర్సీఎం దేవాలయంలో ఆదివారం విన్సెంట్ ది పాల్ పర్వదినాన్ని క్రీస్తు విశ్వాసులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ మేరకు పాస్టర్ మాట్లాడుతూ.. విన్సెంట్ ది పాల్ పేదలను ఆదుకునేందుకు సంస్థను నెలకొల్పారన్నారు. అనంతరం 100 మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. ముందుగా విజయవాడ విన్సెంట్ ది పాల్ సంస్థ సీసీ కార్యదర్శి పితకుమార్‌ను శాలువాతో సత్కరించారు. అనంతరం విశ్వాసులు, సంస్థ ప్రతినిధులు సహపంక్తి భోజనం చేశారు. సంస్థ ప్రతినిధులు బెజవాడ విజయకుమార్, బర్రె శంకరరావు, కిషోర్ కుమార్, పాగోలు రాజు, గుజ్జర్లపూడి సునీత, అమర్లపూడి వెంకటేశ్వరరావు, సొసైటీ సభ్యులు, వృద్ధులు పాల్గొన్నారు.